## క్లుప్తంగా

### వైద్యశిబిరం



**కన్నాయిగూడెం:** మండలంలోని తుపాకులగూడెం పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో స్థానిక వైద్యుడు అభినవ్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు.

### కొనసాగుతున్న సర్వే



**వాజేడు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే మంగళవారం నాలుగోవ రోజు కొనసాగింది. సర్వేను ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, ఆర్ఐ కుమారస్వామి పరిశీలించారు. తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు.

### పంట రుణాలు అందించాలి



**రేగొండ:** అర్హులైన రైతులకు పంట రుణాలు అందజేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం కొత్తపల్లిగోరి మండలంలోని దామరంచపల్లి గ్రామ రైతులకు కొత్త పంట రుణాలు మంజూరు చేయాలని ఎస్‌బీఐ బ్యాంక్ చీఫ్ మేనేజర్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా బ్యాంక్ చీఫ్ మేనేజర్ సతీష్ మాట్లాడుతూ.. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఎక్కువ సిబ్బందిని కేటాయించి త్వరితగతిన రైతులకు రుణాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ జూపాక నీలాంబారం, రైతులు ఉన్నారు.

### విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



**రేగొండ:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎక్సెల్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ తరగతి గదిలోనే నిర్ణయించబడుతుందన్నారు. విద్యార్థులను ప్రయోజకులను చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. లక్ష్య సాధన కోసం ఎన్నో అవరోధాలను అధిగమించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, అసోసియేషన్ సలహాదారు కట్టంగూరు మనోహర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పరామర్శ

**చిట్యాల:** మండల కేంద్రానికి చెందిన కొడెల నర్సయ్య, ముచినిపర్తి గ్రామానికి చెందిన కందికొండ జంగలయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్ మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ మండల నాయకులు పిట్ట సురేష్, ఎరుకొండ రాజేందర్‌గౌడ్, రాజు, నర్సింగరావు, సాంబయ్య, నాగరాజు, వెంకన్న, రమణ, కొమురయ్య ఉన్నారు.

# ధ్వంసమైన వైకుంఠధామాలు



వరద ఉధృతికి ధ్వంసమైన టేకుమట్ల వైకుంఠధామం



అలంకారప్రాయంగా ఉన్న రాఘవరెడ్డిపేట వైకుంఠధామం

- పలు చోట్ల వరదలకు దెబ్బతిన్న వైనం
- వాగు, రోడ్ల వెంటనే మృతదేహాల ఖననం

**టేకుమట్ల:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో రూ.12.60లక్షల నిధులతో గత ప్రభుత్వం మండలంలో ప్రతీ గ్రామంలో వైకుంఠ ధామాలు నిర్మించింది. కానీ వాటిని వినియోగించకపోవడంతో వైకుంఠధామాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని 24 గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాల్లో టేకుమట్ల వైకుంఠ ధామం చలివాగు ఒడ్డుకు ఉండగా గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు చలివాగు ఉప్పొంగి పూర్తిగా ధ్వంసమైంది. ఆశిరెడ్డిపల్లి, అంకుషాపూర్, సోమనపల్లి, సుబ్బక్కపల్లి గ్రామాల వైకుంఠదామాలు చలివాగు ఉధృతికి స్వల్పంగా శిథిలమయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో చెరువుల్లో నిర్మించడంతో అవి పూర్తిగా వినియోగంలోకి రాలేని పరిస్థితి దాపురించింది. మండలంలోని పంగిడిపల్లి, వెలిశాల, రామకిష్టాపూర్(టి), గర్మిళ్లపల్లి, ఎంపేడు, కుందనపల్లి మినహా ఎక్కడా వైకుంఠధామాలను వినియోగంలోకి తీసుకురాలేదు.

**ప్రభుత్వ స్థలాలు లేక..**

కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో అధికారుల ఒత్తిళ్లతో గత సర్పంచ్‌లు చెరువుల్లో నిర్మించారు. దాంతో ఇప్పటి వరకు వాటి వైపు చూసిన దాఖలాలు లేవు. త్వరగా నిర్మించాలంటూ అధికారులు ఒత్తిడి చేయడంతో భవిష్యత్‌కు ఉపయోగపడకుండా నిర్మించారని, దాని వల్ల ప్రజాధనం దుర్వినియోగమైందని పలువురు మండిపడుతున్నారు.

**ప్రధాన రోడ్ల వెంట, చలివాగులో ఖననం**

మండలంలోని అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలను నిర్మించినా ఇప్పటి వరకు కొన్ని గ్రామాల్లో వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ప్రధాన రోడ్ల వెంట, చలివాగులో ఖననం చేస్తున్నారు. మృతదేహాలను వైకుంఠధామాల్లోనే ఖననం చేయాలని అధికారులు అవగాహన కల్పించకపోవడం వల్లనే ఎక్కడపడితే అక్కడ ఖననం చేస్తున్నారు. ప్రధాన రోడ్ల వెంట ఖననం చేస్తున్న సమయంలో రోడ్ల వెంట ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చలివాగు, ప్రధాన రోడ్ల వెంట మృతదేహాలను ఖననం చేయకుండా వైకుతధామాలను ఉపయోగించేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**చలివాగులోనే ఖననం..**



వైకుంఠధామం పక్కనే వాగు ఉండడంతో మృతదేహాలను చలివాగులోనే ఖననం చేస్తున్నారు. చలివాగు నీటిని గ్రామాల్లోకి తాగునీటి కోసం పంపింగ్ చేస్తున్నారు కావున చలివాగులో దహన కార్యక్రమాలను నిలిని వేసి వైకుంఠధామంలో కొనసాగించాలి.

- గుర్రం నాగరాజు, అంకుషాపూర్

**కట్టకింద దహనం..**



మండల కేంద్రంలోని టేకుమట్ల–ఆశిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డులో గల చెరవు కట్టకు మృతదేహాలను ఖననం చేస్తున్నారు. దహనం చేస్తున్న సమయంలో రోడ్డు వెంట ప్రయాణించే వారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోని వైకుంఠధామాలను వినియోగంలోకి తీసుకురావాలి.

-ఎరివెల్లి మహేష్, టేకుమట్ల

# ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలి




ర్యాలీ నిర్వహిస్తున్న సుందరయ్య నగర్ ప్రజలు



ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

**గోవిందరావుపేట:** మండలంలోని నిరు పేదలందరికీ ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇచ్చి, ఇల్లు కట్టించి ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి అన్నారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. మండల కేంద్రంలో దయ్యాల వాగు పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి వారికి ప్రభుత్వం కొనుగోలు పథకం కింద ఇళ్లు కట్టించి ప్రత్యేక కాలనీ నిర్మించి ఇవ్వాలని కోరారు. ప్రాజెక్ట్ నగర్ వరద ముంపునకు గురి అవుతుందని అక్కడి ప్రజలకు ప్రభుత్వం సురక్షితమైన ప్రాంతంలో ప్రత్యేక కాలనీ నిర్మించి ఇవ్వాలన్నారు. అలాగే పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్ఐ సతీష్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు అంబాల మురళి, గొంది రాజేష్, గుండు రామస్వామి, కడారి నాగరాజు, లెనిన్, కోటేశ్వరరావు, రాజేశ్వరీ, కవిత, ఐలయ్య, కృష్ణారావు, అరుణ్, జీవన్, రాజు, బ్రహ్మచారి, సువర్ణ, శారద, సరిత, సమ్మక్క, రాంబాబు, సులోచన, ఆంజనేయులు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



చెక్కులు అందజేస్తున్న బొల్లు దేవేందర్

**ఎస్ఎస్‌తాడ్వాయి:** సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాటిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంతెన రాజు, దాసుల ఉదయలక్ష్మి, అరవింద్, పద్మ, పులి రజితకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ త్వరితగతిన మంజూరు చేయించేలా మంత్రి సీతక్క కృషి చేస్తుందన్నారు. సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కల్యాణి, మాజీ సర్పంచ్ బెజ్జూరి శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ యానాల సిద్ధి రెడ్డి, తాడ్వాయి గ్రామ కమిటీ అధ్యక్షులు పాక రాజేందర్ పాల్గొన్నారు.

# రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దు



మాట్లాడుతున్న ఎస్సై కమలాకర్

**గోవిందరావుపేట:** జాతీయ రహదారిపై, అంతర్గత రోడ్లలపై వరి ధాన్యం ఆరబెట్టొద్దని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. చల్వాయిలో రైతులతో ఎస్సై మాట్లాడుతూ.. రోడ్లపై ధాన్యాన్ని ఆరబోస్తే వాహనదారులకు ఇబ్బందులు కలగడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. రైతులు పొలంలో కల్లాలు చేసుకోని ఆరబోసుకోవాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం రహదారులపైనా ఆరబోస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## ధ్వజారోహణ వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**ములుగు రూరల్:** మండలంలోని మదనపల్లిలో కొలువైన అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధ్వజారోహణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం ఆలయ 16వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన హోమం కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. బుధ, గురు వారాల్లో ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండ సురేఖ, పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్ హాజరవుతున్నారని నిర్వహకులు తెలిపారు.

# మహాసభను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

**గోవిందరావుపేట:** హైదరాబాద్‌లో డిసెంబర్ 21న నిర్వహించనున్న హలో మాదిగా.. ఛలో హైదరాబాద్ మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు అన్నారు. మండల పరిధిలోని పస్రా గ్రామంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిలుగా ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్, వేల్పుల సూరన్న, దయాకర్, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొర్ర భిక్షపతి హాజరై మాట్లాడారు. ఎస్సీల వర్గీకరణ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం దేశంలోనే తెలంగాణ మొదటి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఎస్సీల వర్గీకరణ చేస్తానని ప్రకటించి నేడు మోసం చేశారని తెలిపారు. అనంతరం గోవిందరావుపేట నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎనగదుల మొగులయ్య, ప్రధాన కార్యదర్శిగా బొచ్చు అరవింద్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా పాసుల భద్రయ్య, అధికార ప్రతినిధిగా బుర్రి వెంకటేష్ ఎన్నికయ్యారు.

## పోగొట్టుకున్న ఫోన్ అందజేత



ఫోన్ అందజేస్తున్న ఎస్సై కమలాకర్

**గోవిందరావుపేట:** వరంగల్‌కు చెందిన కందుకూరి వెంకటేశ్వర్లు రెండు నెలల క్రితం మేడారం నుంచి బస్సులో వస్తుండగా పస్రాలో ఫోన్ పడిపోయింది. వెంటనే వెంకటేశ్వర్లు పస్రా పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేశారు. దీంతో ఎస్సై కమలాకర్ స్పందించి సీఈఐఆర్ పోర్టల్ ఆపరేటర్ అశోక్ సహాయంతో ఫోన్‌ను రికవరీ చేసి మంగళవారం బాధితుడికి అందజేశారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదిస్తే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించవచ్చని ఎస్సై తెలిపారు.

# తప్పుడు ప్రకటనలు మానుకోవాలి



మాట్లాడుతున్న రఘు

**ఏటూరునాగారం:** సోషల్ మీడియాలో తప్పుడు ప్రకటనలు, ప్రచారాలను మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో లేనిపోని అనుమానాలు ప్రజల్లోకి తీసుకొని పోయి కాంగ్రెస్ పార్టీని, మంత్రి సీతక్క బదనాం చేయడానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు కుట్ర చేస్తున్నారని అన్నారు. ప్రజల్లోకి అవాస్తవలను తీసుకుపోయే వాళ్లకు దమ్ముంటే వాస్తవాలను బయటకు తీసుకుని రండి ప్రభుత్వానికి, చట్టానికి వ్యతిరేకంగా ఎవరు పనిచేసిన ఏ పార్టీ వారైనా శిక్షహర్హులు అవుతారన్నారు. పగలు రాత్రి టిప్పర్లతో జేసీబీలతో ఇసుక దందా చేస్తున్నారని అనడం సరికాదని, మైనింగ్ కు సంబంధించిన అధికారులు తహసీల్దార్లు, పోలీస్ డిపార్ట్‌మెంట్ వివిధ శాఖల అధికారుల కళ్లు కప్పి ఎవరు చేయలేరని తెలిపారు.

# ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**వెంకటాపురం(కె):** ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి సిద్దబోయిన సర్వేష్ అన్నారు. తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని కోరుతూ తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ కంఠం భూములకు రక్షణ కల్పించాలని అన్నారు. వలస గిరిజనేతరులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ చట్టాలను అమలు చేయటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడకం చిట్టిబాబు, కుర్చింటి చిరంజీవి, బొగ్గుల విష్ణు తదితరులు ఉన్నారు.

# భక్తులకు మెరుగైన వైద్యసేవలు

**రేగొండ:** బుగులోని జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు మెరుగైన వైద్యం అందేలా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా వైద్యాధికారి మధుసూదన్ అన్నారు. రేపటి నుంచి జరిగే బుగులోని జాతర సందర్భంగామండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతర సమయంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. మాస్కులు సరిపడా అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన మందులు ముందుగానే సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి హిమబిందు, సీహెచ్ఓ లింగారెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## కోటంచ ఆలయంలో కార్తీక దీపోత్సవం

**రేగొండ:** మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి కార్తీక మాసం సామూహిక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు బుచ్చమాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారికి సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవంలో పెద్ద ఎత్తున మహిళలు, దంపతులు పాల్గొని సామూహిక దీపారాధన చేశారు. ఉమ్మడి వరంగల్ జోనల్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రావు, సహాయ కమిషనర్ సునీత, ఈఓ మహేష్, అర్చకులు శ్రీనివాసచార్యులు, శ్రీనాథ్, ఆలయ సిబ్బంది శ్రావణ్, సుధాకర్ పాల్గొన్నారు.

# ట్రాన్స్‌కో అధికారుల తనిఖీ



తనిఖీలో పాల్గొన్న ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది

**మంగపేట:** మండల కేంద్రంలో ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం విద్యుత్ కనెక్షన్లను తనిఖీలు చేశారు. 11కేవీ ఫీడర్‌పై నష్టాలు ఎక్కువగా వస్తుండడంతో పోల్‌పోల్ తిరుగుతూ పరిశీలించారు. ఈ సందర్భంగా 642 గృహాలకు అమర్చిన మీటర్లతో పాటు 156 వాణిజ్యపరమైన సర్వీసులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 448 మీటర్ల కనెక్షన్లకు సీల్ చేసి, 11 విద్యుత్ చౌర్యం కేసులు నమోదు చేసినట్లు ఏటూరునాగారం సబ్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్ తెలిపారు. దీంతో పాటు రూ. 1,24000 విద్యుత్ బకాలయిలను వినియోగదారుల నుంచి వసూలు చేసినట్లు వెల్లడించారు.

# దోషులను కఠినంగా శిక్షించాలి

**పలిమెల:** వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, రెవెన్యూ సిబ్బందిపై దాడికి పాల్పడిన దోషులను వెంటనే అరెస్టు చేసి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని తహసీల్దార్ సర్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు దాడికి నిరసనగా మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఇలాంటి దాడులు భవిష్యత్‌లో జరగకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ అనిల్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**కాటారం:** వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, ఇతర సిబ్బందిపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నిరసన తెలిపారు.



మొగుళ్లపల్లి: నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవడంతో పాటు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ నాగరాజు, నయాబ్ తహసీల్దార్ రామ్మోహన్, సర్వేయర్ వినీత్, జూనియర్ అసిస్టెంట్లు సతీశ్, శ్రీనివాస్, అజయ్, రాజశేఖర్, రమాదేవి, ఆపరేటర్ హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

**మొగుళ్లపల్లి:** వికారాబాద్ జిల్లా లగచర్లలో ఔషధ పరిశ్రమ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్ జైన్, రెవెన్యూ అధికారులపై దాడికి నిరసనగా మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని రెవిన్యూ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ సునీత, ఆర్ఐ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రేగొండ:** వికారాబాద్ జిల్లా దుబ్యాల మండలం లగచర్లలో కలెక్టర్‌తో సహ తహసీల్దార్ ఇతర అధికారులపై దాడిని ఖండిస్తూ తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తహసీల్దార్ శ్వేత మాట్లాడుతూ.. వికారాబాద్ కలెక్టర్, ఉద్యోగులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రజాక్, ఆర్ఐ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.



పలిమెల: నిరసన తెలుపుతున్న తహసీల్దార్ సర్వర్, సిబ్బంది



కాటారంలో..



రేగొండలో..

## ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



రంజిత్(ఫైల్)

**వెంకటాపురం(కె):** మండల పరిధిలోని బీసీ మర్రిగూడెం గ్రామంలో ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బీసీ మర్రిగూడెం గ్రామానికి చెందిన పూనెం రంజిత్ (26) మద్యానికి బానిసై రోజు కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండే వాడని తెలిపారు. కాగా, సోమవారం రాత్రి మద్యం తాగి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు మద్యం తాగవద్దని చెప్పడంతో మనస్థాపానికి గరైన రంజిత్ రాత్రి 10.30 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉన్న దూలానికి చీరతో ఉరివేసుకోని ఆత్యహత్య చేసుకున్నాడని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కొప్పుల తిరుపతి రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.